విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 170 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | డిసెంబర్ 2024 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|




## గ్రూప్-1 పరీక్షల రద్దు కుదరదు

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట
- పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమన్న ధర్మాసనం

హైదరాబాద్,

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణ

-మిగతా 3 లో



## అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్క్ పాలన

- కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుంది
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలే ఇచ్చింది
- తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,

కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ

-మిగతా 3 లో

## పోలీస్ శాఖ పై రేవంత్ సర్కార్

# వరాల జల్లు




### పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీల, పదోన్నతులు

- అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పాటు
- తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛ
- పోలీసులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన
- సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వ సహకారం
- ప్రజా పాలన విజయోత్సవాలలో సిఎం రేవంత్ రెడ్డి
- హోం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు
- రాష్ట్రంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం
- 2 వేల మంది సిబ్బందితో ఎస్‌డీఆర్‌ఎఫ్
- సిబ్బందికి శిక్షణ ఇప్పించిన ప్రభుత్వం
- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,

ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా తెలంగాణ పోలీసుల ధైర్య సాహసాలు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఇందుకు వేదికగా మారింది హైదరాబాద్ లోని హెచ్ఎండీఏ గ్రౌండ్. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్న

-మిగతా 3 లో



## ఈ నెల 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

- కేసీఆర్, కిషన్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇస్తే వెళ్లి ఆహ్వానిస్తాం
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి


హైదరాబాద్,

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకోసం వారిని సమయం ఇవ్వాలని కోరినట్లు

-మిగతా 3 లో

## డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు


### డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన



న్యూఢిల్లీ,

అంతర్జాతీయ వ్యాపారంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీని

-మిగతా 3 లో



## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం
- పలు ప్రాంతాల్లో జోరు వానలకు అవకాశం
- డిసెంబర్ 12 నాటికి తమిళనాడు-శ్రీలంక తీర రేఖకు చేరుకుంటుందని అంచనా

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

దక్షిణాదిన దడ పుట్టించిన ఫెంగల్ తుపాన్ తీరం దాటడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపడీనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది. దీంతో ఇప్పట్లో వానలు మళ్లీ రావులే అని జనాలు సంబరపడ్డారు. కానీ ఇంతలో వాతావరణ శాఖ మరో సంచలన వార్త అందించింది. తాజాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరక శుక్రవారం వాతావరణ శాఖ ప్రకటన జారీ

-మిగతా 3 లో



## ప్రపంచం ముంగిట మరో పెనుముప్పు

- దడపుట్టిస్తున్న బ్లీడింగ్ ఐ వైరస్..
- 15 రోజుల్లో 150 మంది మృత్యువాత
- చికిత్సలేక ఇళ్లలోనే చనిపోతున్న జనాలు

న్యూఢిల్లీ

ప్రపంచ దేశాలు 'బ్లీడింగ్ ఐ వైరస్' మహమ్మారికి గజగజ వణకుతున్నాయి. ప్రస్తుతం ఆఫ్రికాను వేధిస్తున్న ఈ వైరస్ అక్కడి నైరుతి కాంగోలో తొలిసారి బయటపడింది. ఈ అంతుచిక్కని వ్యాధి

-మిగతా 3 లో

## విద్యార్థుల్ని మేము ఎవరెస్ట్ ఎక్కిస్తుంటే

# ప్రభుత్వం పాడె ఎక్కిస్తోంది

-మిగతా 3 లో

- దళితుల అభివృద్ధికి సైతం ఈ ప్రభుత్వం వ్యతిరేకం
- దళిత బంధు పెంచి ఇస్తామంటూ హామీ ఇచ్చి మోసం
- అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాలి
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి ) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. "అంబేద్కర్ వారసత్వం, లెగసీ సమాజానికి తెలియకూడదనే దురుద్దేశంతో, అంబేద్కర్ వ్యతిరేక ఆలోచనా విధానంతో ఆయన వర్ధంతిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం లేదు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అతిపెద్ద అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం పూలమాల కూడా

-మిగతా 3 లో





-మిగతా

## నేటి నుంచే సిఎం కప్ - 2024 ప్రారంభం

- -గ్రామస్థాయి పోటీలు డిసెంబర్ 7 నుంచి 8వ తేదీలో
- -జిల్లాస్థాయి పోటీలు డిసెంబర్ 16 నుంచి 21 వరకు

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సి.ఎం. కప్ - 2024 రాష్ట్రములో నిర్వహిస్తున్నామని నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జే.

-మిగతా 3 లో

# 51 గ్రామాల విలీనానికి లైన్ క్లియర్

**-ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్**
**-పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సర్పంచుల పిటిషన్**
**-పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు**



హైదరాబాద్
ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి లైన్ క్లియర్ అయింది. మున్సిపాలిటీల్లో 51 గ్రామాల విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌కు హైకోర్టులో అడ్డంకులు తొలగిపోయాయి. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ.. మాజీ సర్పంచులు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది హైకోర్ట్. పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట మున్సిపాలిటీల్లో 51 గ్రామాలు విలీనం కానున్నాయి. మేడ్చల్ జిల్లాలో మొత్తం 28 గ్రామాలు ఏడు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 12 గ్రామాలు, సంగారెడ్డి జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో 11గ్రామాలు విలీనం కానున్నాయి. ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు అనుకున్న గ్రామాలే. శివారు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం తర్వాత వీటన్నింటినీ గ్రేటర్‌లో కలిపే అవకాశం ఉంది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో బాచారం, గౌరెల్లి, తారామతిపేట పంచాయతీలు విలీనం కానున్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం అవుతాయి. నార్సింగి మున్సిపాలిటీలో మీర్జాగూడ గ్రామపంచాయతీ విలీనం కానుంది. తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామపంచాయతీ.. మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు విలీనమవుతాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలు కలవనున్నాయి. నాగారం మున్సిపాలిటీలో బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు విలీనమవుతాయి. పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ విలీనం కానున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనమవుతాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు, తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం కానున్నాయి. విలీన ప్రక్రియతో రెండు, మూడునెలల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇక్కడి గ్రామాల్లో జరిగే అవకాశం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపాలిటీల పదవీకాలం కూడా వచ్చే ఏడాది జనవరితో పూర్తికానుంది. ఆ తర్వాత ఇప్పుడు విలీనమైన 51 గ్రామపంచాయతీలతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు. మరోవైపు పంచాయతీల విలీనంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో విలీనంతో తాము ఉపాధి పనులు కోల్పోవడంతో పాటు.. పన్నుల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీలో గాలిలో నాణ్యత కొద్దిగా బెటర్


**-నిబంధనలతో మారుతున్న వాతావరణం**



న్యూఢిల్లీ,
దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత మెరుగుపడింది. ఇటీవలే రాజధాని ప్రాంతంలో గాలి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 500 మార్క్‌ను దాటింది. దీంతో కాలుష్య నియంత్రణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-4 నిబంధనలు విధించారు. ఈ నిబంధనలు కాస్త సత్ఫలితాలనిచ్చాయి. ప్రస్తుతం రాజధానిలో గాలి నాణ్యత చాలా వరకూ మెరుగుపడింది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో గాలి నాణ్యత మోడరేట్ కేటగిరీలో నమోదైంది. ఏక్యూఐ లెవల్స్ 183గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. చాందినీ చౌక్, ఐటీవో ప్రాంతాల్లో ఏక్యూఐ 183గా రికార్డైంది. ఓఖ్లా ఫేజ్-2లో 168, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంతంలో 159, పట్పర్గంజ్‌లో 195, ఆయా నగర్‌లో 115, లోధి రోడ్డులో 124, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ -3 వద్ద 137గా ఏక్యూఐ నమోదైంది. అదే సమయంలో కొన్ని ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత పూర్ కేటగిరీలో నమోదైంది. ఆనంద్ విహార్‌లో 246, వాజీపూర్‌లో 208, ఆర్కేపురంలో 204, రోహిణిలో 217, పంజాబీ భాగ్‌లో 212, ముంద్కాలో 244తో పూర్ కేటగిరీలో ఏక్యూఐ నమోదైంది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో వాయుకాలుష్యం మెరుగుపడటంతో ఆంక్షలు సడలించారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. కాలుష్యం మెరుగుపడటంతో జీఆర్ఏపీ-4 ఆంక్షల సడలింపునకు అనుమతి ఇచ్చింది. సుప్రీం అనుమతితో రాజధానిలో శుక్రవారం నుంచి పాఠశాలలు తెరచుకున్నాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

# వడ్డీ రేట్లు యధాతథం..

**-రెపోరేటు 6.50 శాతంగా కొనసాగింపు**
**-వడ్డీ రేట్లను ప్రకటించిన గవర్నర్ శక్తికాంత దాస్**




న్యూఢిల్లీ,
దేశ ఆర్థిక వృద్ధి రేటు మందగించిన నేపథ్యంలో ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ నగదు నిల్వల నిష్పత్తిని 4.50 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని పెంచడంలో సహాయపడుతుందని, తద్వారా బ్యాంకులు వృద్ధిని వేగవంతం చేయడానికి మరింత ఎక్కువ రుణాలను పంపిణీ చేయగలవని భావిస్తున్నారు. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం రూ.1.16 లక్షల కోట్ల నగదును పెంచడంలో దోహదపడుతుంది. సెంట్రల్ బ్యాంక్ తన పాలసీ రేటులో అంటే రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. రెపో రేటు 6.50 శాతం వద్ద కొనసాగుతోందని, ఫిబ్రవరి 2023 నుండి రెపో రేటులో ఎటువంటి మార్పు లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది 11వసారి. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. క్యాష్ రిజర్వ్ రేషియోలో 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. %జ== -% 4.50 శాతం నుండి 4 శాతానికి తగ్గించారు. నగదు నిల్వల నిష్పత్తి తగ్గింపును రెండు దశల్లో అమలు చేయనున్నారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల అదనపు నగదు అందుబాటులోకి వస్తుంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మూడు రోజుల సమావేశం డిసెంబర్ 4న ప్రారంభం కాగా, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం(డిసెంబర్ 6) ప్రకటించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, వృద్ధిని కొనసాగించడంతోపాటు ధరలను స్థిరంగా ఉంచడమే మా లక్ష్యం అని ఆర్‌బిఐ గవర్నర్ అన్నారు. అదే సమయంలో వృద్ధిని కొనసాగించడం ముఖ్యమని, ఇది ఆర్‌బిఐ చట్టంలో కూడా ఉందన్నారు. జిడిపి వృద్ధి రేటు క్షీణతపై ఆర్‌బిఐ గవర్నర్ మాట్లాడుతూ, ఆర్థిక వృద్ధి రేటు క్షీణతకు కారణం పారిశ్రామిక ఉత్పత్తి క్షీణత. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పారిశ్రామిక వృద్ధిరేటు 7.2 శాతం కాగా, రెండో త్రైమాసికంలో 2.1 శాతానికి తగ్గింది. తయారీ రంగం వృద్ధి రేటు తగ్గిందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగిందని, అయితే పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గుతోందని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. ఆర్‌బీఐ వృద్ధి రేటు అంచనాను తగ్గించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ఆర్‌బిఐ జిడిపి వృద్ధి రేటు 6.6 శాతంగా అంచనా వేసింది. ఇది అంతకుముందు 7.2 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీపీపీ వృద్ధి రేటు 6.6 శాతంగా, నాల్గవ త్రైమాసికంలో 6.8 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది.

## రాజ్యసభలో నోట్ల కలకలం 222 సీటు వద్ద రూ. 500 కట్టలు



న్యూఢిల్లీ,
పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎగువ సభ లో భారీగా నగదు పట్టుబడింది. ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద నోట్ల కట్ట లభ్యమైనట్లు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తాజాగా వెల్లడించారు. సాధారణ భద్రతా తనిఖీల్లో భాగంగా గురువారం సభ వాయిదా పడిన తర్వాత సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.500 నోట్లతో ఉన్న నగదు కట్టను గుర్తించినట్లు చెప్పారు. సీటు నంబర్ 222 నుంచి భద్రతా అధికారులు కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సీటు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీ అభిషేక్ మను సింఘ్వీనికి కేటాయించిందిగా గుర్తించినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ అంశంపై విచారణకు ఆదేశించినట్లు ధన్‌ఖర్ వెల్లడించారు. మరోవైపు తాజా ఘటనపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అం శంలో సింఘ్వీ పేరును ప్రస్తావించడంపై మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు.

## అరుదైన దృశ్యం.. మోడీ, ఖర్గే నవ్వులు



హైదరాబాద్
రాజకీయాల్లో ఎప్పుడు నిప్పు, ఉప్పులా ఉండే నాయకులు ఒకే దగ్గర కూర్చుని మాట్లాడుకోవడం చాలా అరుదు. ఇలాంటి ఘటనలు ఏదో ఒక సందర్భంలో మాత్రమే అరుదుగా కనిపిస్తుంటాయి. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉంటాయి. ఆ సందర్భంగా ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధికార పక్షాన్ని ఇరకాటంలో పెడుతూనే ఉంటారు. ఇరువరి మధ్య అగ్గిరాజేసినట్లు ఒకరిమీద మరొకరు విమర్శలు, మాటల దాడులు చేసుకుంటూ కనిపిస్తారు. కానీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాపరినిర్వాణ్ దివస్ సందర్భంగా భారత ప్రధాని మోడీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఇద్దరూ కరచాలనం చేసుకొని కాసేపు నవ్వుతూ మాట్లాడుకున్నారు. దీంతో కెమెరాలన్నీ వారినే ఫోకస్ చేశాయి. ఒకే ఫ్రేంలో వీరిద్దరితో పాటు మాజీ ప్రెసిడెంట్ రామ్ నాథ్ కోవింద్ సైతం నవ్వుతూ కనిపించారు. దీనికి ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం హాజరయ్యారు.

## అరెస్టులతో భయపడా : పాడి కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్,
ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు హుజూరాబాద్ ప్రజల కోసం ప్రశ్నిస్తానన్నారు. ప్రజల ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి జడ్జి బెయిల్ మంజూరు చేసిన అనంతరం అయన మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని తన నివాసంలో జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే నోటీసులు ఇచ్చి వదిలిపెట్టేందుకు అవకాశాలున్నా రాత్రి పొద్దుపోయే దాకా పీఎస్‌లోనే నిర్బంధించారు. రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి అర్ధరాత్రి కొత్తపేటలోని న్యాయమూర్తి ఇంట్లో హాజరుపరిచారు. వాదనలు విన్న జడ్జి.. రిమాండ్‌ను తిరస్కరించారు. రూ.5 వేలు జరిమాన, ఇద్దరి పూచీకత్తుతో కౌశిక్‌కు బెయిల్ మంజూరు చేశారు.

## పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్న కేసీఆర్

**-8న మధ్యాహ్నం 1 గంటలకు సమావేశం**
**-ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ కానున్న కేసీఆర్**

హైదరాబాద్,,
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎల్లుండి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 1 గంటలకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమవుతారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. సచివాలయంలో ఏర్పాటు చేస్తోంది తెలంగాణ తల్లి విగ్రహమా? లేక కాంగ్రెస్ తల్లి విగ్రహమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని మండిపడ్డారు.

# పోలీస్ శాఖ పై రేవంత్ సర్కార్ వరాల జల్లు..

(మొదటి తరువాయి)

విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హోం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పలు స్టాల్స్ లను ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, అధికారులు వాటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. మహనీయులు అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పడిందని, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఇప్పటికే తాము ఆరు గ్యారెంటీలను ప్రవేశపెట్టామని, అదే రీతిలో ఏడో గ్యారంటీగా స్వేచ్ఛను అందించమని సీఎం అన్నారు. పోలీసులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకుందని తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం అన్ని విధాలా పోలీసులకు సహకరిస్తుందన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని తెలంగాణ పోలీసులు పూర్తి స్థాయిలో అడ్డుకుంటున్నారని, మరింత స్పీడ్ పెంచాల్సిన ఆవశ్యకత పోలీసులపై ఉందన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీల, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసినట్లు సీఎం పునరుద్ఘాటించారు. హైదరాబాద్ అంటేనే డ్రగ్స్ విక్రయాలు నిర్వహించేందుకు భయపడే రీతిలో పోలీసులు విధులు నిర్వర్తించాలని సీఎం సూచించారు. అలాగే విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కూడా పోలీస్ శాఖ కూడా తన వంతు భాధ్యత వహించాలని సీఎం సూచించారు. ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్ జెండర్స్ ను తీసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, సమాజ నిర్లక్ష్యానికి గురైన వారి విధులను పోలీస్ శాఖ సద్వినియోగం చేసుకుంటుందని తెలిపారు. ఉగ్రవాదుల ముప్పు సమయంలో గ్రేహౌండ్స్ బలగాలు ప్రాణాలు అర్పిస్తే వారి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తూ తోడ్పడుతుందన్నారు. తెలంగాణ హోం గార్డ్స్ కి జీతాలు పెంచినట్లు సీఎం శుభవార్త చెప్పారు. ఎవరైనా హోం గార్డ్స్ విధుల్లో ప్రాణాలు అర్పిస్తే, వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు అందిస్తామన్నారు. అంతేకాకుండా వారికి హెల్త్ కార్డ్ లు కూడా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, కొత్త సంవత్సరంలో నూతన ఆదేశాలు అమలవుతాయని సీఎం అన్నారు. పోలీస్ కుటుంబాల పిల్లల చదువుల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, అందుకు 50 ఎకరాలలో స్కూల్ నిర్మించడం జరుగుతుందని, హోం గార్డ్ నుండి డీజీపీ స్థాయి అధికారి పిల్లలకు ఉచిత విద్యను కార్పొరేట్ స్థాయిలో అందిస్తామని సీఎం వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో సుమారు 94 వేల మంది పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారని, వారి కృషి ఉత్తమ విధులతోనే రాష్ట్రం శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పుడూ ముందంజలో ఉందని సీఎం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్ర విపత్తు నిర్వహణ దళంను (ఎస్డీఆర్ఎఫ్) ప్రారంభించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హోంశాఖ వేడుకలను నిర్వహించింది. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విపత్తు దళానికి చెందిన బోట్స్‌ను కూడా సీఎం ప్రారంభించారు. భారీ అగ్నిప్రమాదాలు, భూకంపం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ఈ దళం అత్యవసర సహాయక చర్యలు చేపట్టనుంది. అగ్నిమాపక కేంద్రాలు ఇక నుంచి ఎస్డీఆర్ఎఫ్ స్టేషన్లుగా రూపాంతరం చెందనున్నాయి. జులై, ఆగస్ట్ నెలల్లో భారీ వర్షాలు కురవడంతో హైదరాబాద్, ఖమ్మం సహా పలు ప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... ఎన్డీఆర్ఎఫ్ తరహాలో సుశిక్షితులైన దళం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఎస్డీఆర్ఎఫ్ ను ఏర్పాటు చేయడంతో పాటు దీనిని ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35.03 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆధునాతన పరికరాలు, కొత్త అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేసి సిబ్బందికి ఎస్డీఆర్ఎఫ్ ప్రాథమిక కోర్సుల్లో శిక్షణ ఇప్పించారు.

# విద్యార్థుల్ని మేము ఎవరెస్ట్ ఎక్కిస్తుంటే ప్రభుత్వం పాడె ఎక్కిస్తోంది

(మొదటి తరువాయి)

వెయ్యట్లేదు. దళితులందరికీ సమాజంలోని ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చే అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలి. దీని వెనుక ఉన్న లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలి. కేవలం కాంగ్రెస్ హై కమాండ్ ఉద్దేశాలతోనే అంబేద్కర్ విగ్రహానికి అవమానం చేస్తున్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. "ప్రకాష్ అంబేద్కర్ చేత ప్రారంభించిన మహా విగ్రహానికి ఎందుకు అవమానం చేస్తుంది? తాళాలు వేసి బంధించి కనీసం శుభ్రపరచకుండా ఎందుకు పెట్టింది. బీఆర్ఎస్ పైన అక్కసు ఉంటే దానిని అంబేద్కర్ విగ్రహం పైన ఎందుకు చూపిస్తున్నారు. అంబేద్కర్‌కు నివాళులు అర్పించకుండా అడ్డుకుంటుంది మమ్మల్ని కాదు అంబేద్కర్ వారసులను అంబేద్కర్ ఆలోచన విధానాన్ని. అంబేద్కర్‌కి నివాళులు అర్పించాలనే ఇంగిత సంస్కారం లేని కుసంస్కారి రేవంత్ రెడ్డి. ప్రపంచం అబ్బురపడిన మహా మేధావి అంబేద్కర్ గారిని స్మరించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికక్కడో విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో దేశానికి ఒక గొప్ప సందేశం ఇచ్చేలా ఏర్పాటు చేసుకున్న 125 ఫీట్ల అంబేద్కర్ విగ్రహం పైన ప్రభుత్వం కావాలని నిర్లక్ష్యం వహిస్తున్నది" అని కేటీఆర్ అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానానికి అంబేద్కర్ విగ్రహానికే కాదు దళితుల అభివృద్ధికి సైతం ఈ ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. దళిత బంధు పెంచి ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసింది. దళిత బంధు చెక్కులను రద్దుచేసి వారి జీవితాలను మారకుండా చేస్తున్నది. పేద దళిత గిరిజన బహుజన బిడ్డలను ఉన్నత చదువుల కోసం గత ప్రభుత్వం విదేశాలకు పంపిస్తే%ౌ% ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఓర్వలేక వారి ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులను నిలిపివేశారు. తెలంగాణ బిడ్డలు విదేశాల్లో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల విద్యార్థులను మేము ఎవరెస్ట్ ఎక్కిస్తే, ఈ ప్రభుత్వం వారిని పాడె ఎక్కిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వివక్షను చేతగానితనాన్ని దాచిపెట్టడం కోసమే భారత రాష్ట్ర సమితి చేపట్టిన గురుకుల బాటను అడ్డుకుంది" అని కేటీఆర్ తెలిపారు. "ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నాయకుల పైనా కేసులు పెట్టింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షకుని మాదిరిగా పోజులు కొడుతూ దేశంలో తిరుగుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తమను అడ్డుకున్న పోలీసుల పైన ఉక్రోషం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, అదే హోదాలో ఉన్న ఎమ్మెల్యేలను శాసనసభ పక్ష నేతలను తెలంగాణ పోలీసులు అడ్డుకున్న విషయాన్ని గుర్తించాలి. తమ సొంత కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా నియంతృత్వంగా వ్యవహరిస్తున్న తీరుని గుర్తించాలి. నిజంగానే రాహుల్ గాంధీకి రాజ్యాంగం పైన ప్రేమ ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు పైన సద్బుద్ధి ప్రసాదించాలని సూచించాలి" అని కేటీఆర్ అన్నారు. "రానున్న అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాలి. 11 నెలల కాలంలో ఈ రాష్ట్రం సబ్బండ వర్గాలకు చేసిన అన్యాయాలను ప్రశ్నిస్తాము. లగచర్ల అంశం నుంచి మొదలుకొని రాష్ట్రంలో కొనసాగుతున్న ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలులో వైఫల్యం, వ్యవసాయ రంగ సంక్షేమం, ప్రతి అంశం పైనా, ప్రజా సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాము. మా పార్టీ అధ్యక్షులు తెలంగాణ ప్రధాత కేసీఆర్ గారి పైన కాకికూతలు కారుకూతలు మానకుంటే ముఖ్యమంత్రి కి ముఖ్యమంత్రి పదవికి కూడా గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇదే ముఖ్యమంత్రి సోనియాగాంధీని అడ్డగోలుగా దూషించిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. రేవంత్ రెడ్డి నోటి తీరు మార్చుకుంటేనే ఆయన పదవికి గౌరవం దక్కుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తమ ప్రవర్తనతో పదవులకు వ్యక్తులకు గౌరవం వస్తుంది. కానీ అడుక్కుంటే కాదని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలి. రేవంత్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా%ౌ% కాంగ్రెస్ తల్లి విగ్రహమా%ౌ% చెప్పాలి" అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినప్పుడు విగ్రహాల రూపులు చరిత్రను మారుస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. ఉద్యమకాలంలో సబ్బండ వర్గాలు, కవులు, కళాకారులు, మేధావులు అంతా కలిసి తెలంగాణ పరిస్థితిలకు అనుగుణంగా సంస్కృతికి అనుగుణంగా రూపం ఇచ్చిన తల్లి విగ్రహమే తెలంగాణ తల్లి. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలను దాటుకొని ఒక దేవతను ఊరేగించిన మాదిరి తెలంగాణ తల్లి విగ్రహ స్థాపన చేశాం. రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి రూపు మారుస్తానని తెలంగాణ చరిత్రను మారుస్తానని నీచమైన మనస్తత్వంతో ఈ కుటిల ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఇందిరాగాంధీ భరతమాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తర్వాతి ప్రభుత్వాలు మార్చాయా?

# ప్రపంచం ముంగిట మరో పెనుముప్పు

(మొదటి తరువాయి)

కాంగోలోని క్వాంగో ప్రావిన్సులో మారణహోమాన్ని సృష్టిస్తుంది. కేవలం 15 రోజుల్లో దాదాపు 150 మందిని పొట్టనబెట్టుకుంది. దీంతో ఆ దేశ ఆరోగ్య అధికారులు హెల్త్ ఎమర్జెన్సీ జారీ చేశారు. నవంబర్ 10 నుంచి నవంబర్ 25 మధ్య కాంగో ప్రావిన్స్‌లోని పాంజీ హెల్త్ జోన్‌లో ఈ మరణాలు సంభవించాయి. అంతుచిక్కని మరణాలను గల కారణాలను అన్వేషించడానికి రోగుల నుంచి నమూనాలు సేకరించేందుకు ఒక వైద్య బృందం పాంజీ హెల్త్ జోన్ చేరుకుంది. అక్కడి ప్రాంతీయ ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా ప్రకారం. దీని అనారోగ్య లక్షణాలు ఫ్లూని పోలి ఉన్నట్లు తెలిపారు. రోగుల్లో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, దగ్గు, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీనికి చికిత్స అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులు



తమ ఇళ్లలోనే మృత్యువాత పడుతున్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని ఆరోగ్య అధికారులు సమస్యాత్మక ప్రదేశాల్లో జనాల అనారోగ్యంపై నిఘా ఉంచారు. ఇది అంటువ్యాధని, మృతదేహాల దరిదాపుల్లోకి కూడా ఎవ్వరూ రావొద్దంటూ అక్కడి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇక్కడి ఆరోగ్య సమస్యను పరిష్కరించడానికి, వైద్య సామాగ్రిని సరఫరా చేయాలని ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా దేశీయ, విదేశీ భాగస్వాముల సహాయం కోరారు. రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. స్థానిక ఎపిడెమియాలజీ ప్రకారం, ఈ వ్యాధి మహిళలు, పిల్లలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొంది. మరణాల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ఒక్క నవంబర్ 25వ తేదీన దాదాపు 67 మరణాలు నమోదైనట్లు అక్కడి ఆరోగ్య అధికారులు వెల్లడించారు. చైనా నుంచి శరవేగంగా ప్రపంచ దేశాలకు ప్రయాణించిన కోవిడ్ -19 వ్యాప్తితో కోట్లాది మంది ప్రాణాలు వదిలారు. కాంగోలో విజృంభిస్తున్న ఈ కొత్త వైరస్‌ను కట్టడి చేయకుంటే మరోమారు ప్రమదం ముంచుకొచ్చే అవకాశం ఉందని ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి.

## గ్రూప్-1 పరీక్షల రద్దు కుదరదు

(మొదటి తరువాయి)

జరిపిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించినట్లయింది. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నోటిఫికేషన్ చట్ట విరుద్ధమని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును అభ్యర్థులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని తెలిపింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం పేర్కొంది. కోర్టుల నిర్ణయంతో నియామకాల్లో జాప్యం జరుగుతుందని తెలిపింది. మెయిన్స్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వానికి పచ్చజెండా ఊపింది

## అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్క్ పాలన

(మొదటి తరువాయి)

భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కాంగ్రెస్ మార్క్ పాలన కనిపిస్తోందన్నారు.ప్రజాపాలన పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన దోపిడీ అంతా ఇంతా కాదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన మీకు ప్రజలు మళ్లీ అధికారం ఇస్తారా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ చెబుతున్నారని, కానీ రాజీవ్ గాంధీ, ఆయన కుటుంబం చేసిన త్యాగం తెలుసా? అని ప్రశ్నించారు. వారి కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించిందన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్ చేసిన త్యాగం ఏమిటో చెప్పాలని నిలదీశారు. భూములు, నిధులు, నియామకాల పేరుతో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దోచుకుందని ధ్వజమెత్తారు..

## ఈ నెల 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

(మొదటి తరువాయి)

చెప్పారు. వారు అపాయింట్ మెంట్ ఇస్తే ప్రభుత్వం తరఫున ఆహ్వానిస్తామన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిన్ననే చెప్పారని గుర్తు చేశారు. వారు ఈ నెల 9న జరగనున్న ఈ కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

## డాలర్ స్థానంలో వేరే కరెన్సీనిఉపయోగించే దేశాలపై పన్నులు

(మొదటి తరువాయి)

ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని చెప్పారు. అమెరికాకు ఆ దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై పన్నులు 100 శాతం పెంచుతామని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల ప్రయత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుండదని హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మర్చిపోవాల్సి వస్తుందని వివరించారు. అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీ వాడాలని నిర్ణయించాయి. దీనివల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంలో ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపాయి. ఓ డిక్లరేషన్‌పై బ్రిక్స్ దేశాలు సంతకం చేశాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

## నేటి నుంచే సిఎం కప్ - 2024 ప్రారంభం

(మొదటి తరువాయి)

ముత్తన్న తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు వెబ్ పోర్టల్ నందు తప్పక తమ పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న సి.ఎం. కప్ - 2024 లో భాగంగా నిజామాబాద్ జిల్లా గ్రామస్థాయి పోటీలు డిసెంబర్ 7 నుంచి 8వ తేదీలో రెండు రోజుల పాటు జరుపుతారు. గ్రామ పంచాయతీస్థాయి క్రీడలు, 1. అథ్లెటిక్స్, 2. ఫుట్బాల్, 3. కబడ్డీ, 4. కోకో, 5. వాలీబాల్, 6. యోగా విభాగాల కింద నిర్వహిస్తారు. విజేతలను మండల స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. మండల స్థాయి, నిజామాబాద్ మున్సిపాలిటీ స్థాయిలో డిసెంబర్ 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు (03 రోజులు) నిర్వహిస్తారు. జిల్లాస్థాయి పోటీలు డిసెంబర్ 16 నుంచి 21 వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు ఏడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగే క్రీడలకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు వారికి ఆసక్తి ఉన్న క్రీడలో పాల్గొనేందుకు అనే వెబ్ పోర్టల్ నందు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు తప్పనిసరిగా వెబ్ పోర్టల్లో అప్లోడ్ చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జే. ముత్తన్న తెలిపారు. ఇతర వివరాలకు 97011 77144, 98667 70889, 78159 57048 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాగలరు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

(మొదటి తరువాయి)

చేసింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపింది. డిసెంబర్ 6,7 తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. అది డిసెంబర్ 7 నాటికి అల్పపీడనంగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. అది వాయువ్య దిశగా పయనించి డిసెంబర్ 12 నాటికి తమిళనాడు-శ్రీలంక తీర రేఖకు చేరుకుంటుందని అంచనా. దీని ప్రభావంతో తమిళనాడులోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైలోని కొన్ని ప్రాంతాలు, దాని శివారు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ 12, 13 తేదీల్లో తమిళనాడులోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని IMD అంచనా వేసింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించింది.

# సంపాదకీయం

## ఈ వివాదాలకు అంతమెక్కడ?

చాలా చట్టాల రూపకల్పనను నేను మొదటి నుంచి చివరివరకు పర్యవేక్షించడం జరిగింది. ముసాయిదా బిల్లు చిన్నదిగా, స్ఫుటంగా, స్పష్టంగా ఉండాలని న్యాయమంత్రిత్వ శాఖ న్యాయశాస్త్ర నిపుణులకు గట్టిగా సూచించేవాణ్ణి. 'ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం%–%1991' నా ప్రమేయమున్న చట్టాలలో ఒకటి. అది చాలా చిన్న చట్టం. 8 సెక్షన్లు మాత్రమే అందులో ఉన్నాయి. ఆ చట్టానికి ఒక లక్ష్యమున్నది. ఆ లక్ష్యం స్ఫుటంగా ఉన్నది: ఆగస్టు 5, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని స్తంభింపజేయడం అంటే యథాతథంగా ఉండేలా చేయాలని నిర్దేశించింది. ఆ చట్టం చాలా స్పష్టంగా ఉంది. 'అయితే'లు, 'అయినా'లు, 'కానీ' లకు లేదా అయినప్పటికీ' ఇత్యాది మినహాయింపులు, అభ్యంతరాలకు తావివ్వనిదిగా ఉన్నది. మరీ ముఖ్యంగా ఆ చట్టం పూర్తిగా 'పక్షపాత రహితం'గా ఉన్నది. పూర్వ భావనలు, అవిచారితాభిప్రాయాలను ప్రోత్సహించేదిగా లేదు. ఆ చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 4 (1)ని ప్రతి ఒక్కరూ చదవాలని నేను కోరుతున్నాను. సెక్షన్ 3: ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని మార్చడంపై నిషేధం. ఒక మతపరమైన ప్రార్థనా స్థలం లేదా మతపరమైన ప్రార్థనా స్థలంలోని ఒక విభాగాన్ని వేరే మతానికి లేదా అదే మతానికి చెందిన వేరే సంప్రదాయానికి చెందిన ప్రార్థనా స్థలంగా ఎవరూ మార్చకూడదు. సెక్షన్ 4: ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని మార్చడానికి సంబంధించి అన్ని అప్పీళ్లు, దావాలు లేదా ఇతర న్యాయవిచారణ కార్యకలాపాలు చట్టం ప్రారంభమైన తరువాత ముగుస్తాయి. తాజా అప్పీళ్లను దాఖలు చేయడం అనుమతించడబదు. ఆగస్టు 15, 1947న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావం ఎలా ఉన్నదో, ఆ రోజున ఉన్న రీతిలోనే కొనసాగుతుంది. అయితే (అయోధ్యలో ఉన్న) రామజన్మభూమి%–%బాబ్రీ మసీదుగా దేశ ప్రజలకు సుపరిచితమైన ప్రార్థనా స్థలాన్ని మాత్రం ఈ చట్టం నుంచి మినహాయించారు. ఆ ప్రార్థనా స్థలంపై అప్పటికే సుదీర్ఘకాలంగా న్యాయ వివాదం కొనసాగుతుండడమే ఆ మినహాయింపునకు కారణం. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం లక్ష్యం, ఉద్దేశం, స్ఫూర్తి, పరిధికి విస్తృతంగా ప్రజామోదం లభించింది. సామాన్య విద్యావంతులు, న్యాయశాస్త్ర నిపుణులు ఆ చట్టాన్ని హర్షామోదాలతో స్వాగతించారు. ఆ చట్టం తన లక్ష్యాన్ని సాధించిందని నేను అభిప్రాయపడుతున్నాను. వివిధ ప్రార్థనా స్థలాలకు సంబంధించిన పలు వివాదాలపై ఎటువంటి జగడాలు లేకుండా మూడు దశాబ్దాల పాటు ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. ఒక దేవాలయం ఒక దేవాలయంగా ఉండాలని, ఒక మసీదు ఒక మసీదుగా ఉండాలని, ఒక చర్చి ఒక చర్చిగా ఉండాలని, ఒక గురుద్వారా ఒక గురుద్వారాగా ఉండాలని, ఇంకా ఇతర మతాల ప్రార్థనా స్థలాలు ఆగస్టు 15, 1947న ఎలా ఎలా ఉన్నాయో అలాగే యథాతథంగా ఉండాలనే విషయాన్ని దేశ పౌరులు చాల వరకు అంగీకరించారు. దురదృష్టవశాత్తు ప్రార్థనా స్థలాల (కొత్త నిబంధనలు) చట్టం అమలవుతున్న తీరు తెన్నులపై సమగ్ర సమాచారం లేదు. %్గా=×ూవీ% పార్లమెంటు కార్యకలాపాల పరిశోధనా సంస్థ)ను వాకబ్ చేయగా ఆ చట్టం కింద జరిగిన అరెస్టులు, విధింపబడిన శిక్షల గురించి పార్లమెంటులో మూడు సందర్భాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం చప్పిడి సమాధానాలు మాత్రమే ఇచ్చిందని తెలియజేసింది. మొత్తం మీద కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆ చట్టం పనిచేస్తున్న తీరుపై నిరపాయకరమైన నిరక్ష్యం చూపారని చెప్పవచ్చు. న్యాయస్థానాలు రంగప్రవేశం చేశాయి. అక్టోబర్ 28, 2020న దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఒక రిట్ పిటిషన్ దాఖలయింది. ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం%–%1991లోని సెక్షన్లు 2, 3, 4 సెక్షన్లను నిష్ప్రయోజనకరమైనవిగాను, రాజ్యాంగవిరుద్ధమైనవిగాను ప్రకటించాలని ఆ రిట్ పిటిషన్ విజ్ఞప్తి చేసింది. పిటీషన్‌దారు అందుకు చూపిన కారణమేమిటి? అనాగరిక దురాక్రమణదారులు న్యాయసమ్మతం కాని రీతిలో 'ప్రార్థనా స్థలాల'ను తమవిగా చెల్లబాటు చేయడానికి ప్రయత్నిస్తున్నందున 1991 చట్టంలోని 2, 3, 4 సెక్షన్లను రద్దు చేయాలి. ఇదీ ఆ పిటీషనర్ వాదన. సెక్షన్ 3, సెక్షన్ 4 ఆ చట్టంలోని కీలక భాగాలు. అవి లేకుంటే ఆ చట్టంలో ఏమీ ఉండదు. అది అసలు అనవసరం. భారత రాజ్యాంగం అధికరణలు 14, 15, 21, 25, 26, 29ని ఆ రెండు సెక్షన్లు ఉల్లంఘిస్తున్నాయనే వాదనతో సుప్రీంకోర్టులో సెక్షన్ 3, సెక్షన్ 4ను సవాల్ చేశారు. ఆ 'ప్రార్థనా స్థలాలు' అనాగరిక దురాక్రమణ దారులు చట్టవిరుద్ధంగా స్వాయత్తం చేసుకున్నవని పిటీషనదారు పేర్కొనడం గమనార్హం. ఏ మత ప్రజల తరపున తాను ఈ పిటిషన్ దాఖలు చేసింది, ఏ మత సమూహాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పిటీషన్‌ను వేసింది కూడా పిటీషన్‌దారు స్పష్టంగా పేర్కొన్నాడు. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'హిందువుల, జైనుల, బౌద్ధుల, సిక్కుల' మత ప్రదేశాలను చట్టబద్ధంగా ఆయా మతస్థులకు పునరుద్ధరించాలని ఆ పిటీషన్‌దారు అభ్యర్థించాడు. అక్టోబర్ 28, 2020 నుంచి ఆ రిట్ పిటీషన్ పెండింగ్‌లో ఉన్నది. 2023లో సుప్రీంకోర్టు ఒక స్పెషల్ లీవ్ పిటీషన్ (ఎస్–ఎల్‌పి)ను విచారణకు స్వీకరించింది. వారణాసిలోని అంజుమన్ ఇంతెజామియ మసీద్ నిర్వహణా కమిటీ ఆ పిటిషన్‌ను దాఖలుచేసింది. ఆగస్టు 3, 2023న అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఒక ఆదేశాన్ని ఆ ఎస్ఎల్‌పి సవాల్ చేసింది. జ్ఞాన్‌వాపి మసీదు ఉన్న స్థలాన్ని సర్వే చేయాలని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ)ను జిల్లా జడ్జి ఆదేశించారు. ఈ ఆదేశానికి వ్యతిరేకంగా వారణాసిలోని అంజుమన్ మసీదు నిర్వహణదారుల అప్పీల్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టి వేసింది. హైకోర్టు నిర్ణయాన్ని అంజుమన్ మసీదు నిర్వహణదారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆగస్టు 4, 2023న సుప్రీంకోర్టు జారీ చేసిన ఒక ఉత్తర్వు ఇలా పేర్కొంది: 'హైకోర్టు అభిప్రాయంతో విభేదించలేక పోతున్నాం. రాజ్యాంగ అధికరణ 136 కింద మా న్యాయాధికారాలను వినియోగించుకుంటూ ఆ నిర్ణయానికి వచ్చాం.. సొలిసిటర్ జనరల్ వాదనలను నమోదు చేశాం. ఈ కేసులో న్యాయప్రక్రియ అంతా ఎఎస్ఐ అనుసరించే పద్ధతులపై ఆధారపడి ముగుస్తుంది'. సుప్రీంకోర్టు ఉత్తర్వు అనేక ఉపద్రవాలకు ఆస్కారం కల్పించింది. చిక్కులకు దారితీస్తోంది. 2022లో సివిల్ దావా (18) వేసిన వారి ఉద్దేశాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరపలేదు. ఆ దావా వేసినవారి అభ్యర్థన: జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలోని ఉన్న దేవతామూర్తులకు పూజలు, ఇతర క్రతువులు నిర్వహించే హక్కు తమకు ఉందని, కనుక ఆ మసీదులో పూజలకు తమను అనుమతించాలి. ఒక మసీదులో ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు తమను అనుమతించాలన్నదే దావా వేసిన వారి అభ్యర్థన అన్నది స్పష్టం. వారి విజ్ఞప్తిని అంగీకరించి, అక్కడ ఉన్నాయంటున్న హిందూ దేవతా మూర్తులకు పూజలు నిర్వహించేందుకు అనుమతి నివ్వడమంటే ఆ మసీదును, కనీసం పాక్షికంగా అయినా ఒక దేవాలయంగా మార్చడమే అవుతుంది.

# జెలెన్ స్కీ పుణ్యమే ఉక్రెయిన్ యుద్ధం!

అధినేత అని ఊరికే అనరు. ప్రజలు వారికి అలవోకగా ఆ బిరుదు ఇవ్వరు. పరిపాలనా దక్షకుడు అనేది కూడా భావోద్వేగాల లోంచి పుట్టుకురాదు. తాను పాలించే ప్రజల ధన ప్రాణ మానాలకు నష్టం కలగకుండా ఓర్పుతో నేర్పుతో నెగ్గుకు రావడం వల్ల కలిగే కీర్తి పరిపాలనా దక్షత. ఈ మధ్య కాలంలో అవేవీ లేకుండా గాలి వాటంగా నేతలు అధినేతలై గద్దెనెక్కుతున్నారు. ముఖ్యంగా ప్రజల పాలన పట్ల ఏ మాత్రం అవగాహన లేనివారు, తమ అభిమాన గణం అహెూ ఓహెూల మధ్య నాయకులై పోతున్నారు. వారికి తోచిందే నినాదం. దేశమేదైనా ప్రజలను చాలా చాలా సులువుగా ఆకట్టుకొని మంట పుట్టించే నినాదాలు జాతీయవాదం, మతం. మనదేశంలో అయితే కులం అనే మరో అదనపు నినాదం కూడా ఉంది. ఈ నినాదాలకు కాస్త గ్లామర్ తోడైతే ఇక నేతల జనాదరణకు ఆకాశమే హద్దు. ఇలాంటి వారిని మన దేశంలో చాలా మందే చూడొచ్చు. కాకపోతే వారు ఇంకా రాష్ట్రాల పరిధిలోనే ఉండిపోయారు కాబట్టి మనం బతికిపోతున్నాం సుమా! అసలు విషయంలోకి వస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా ఈ కోవలోనే అధికారంలోకి వచ్చాడు. అంతకుముందు ఆయన రాజకీయాలతో ఎలాంటి ప్రమేయం లేని వ్యక్తి. ప్రజలు, ప్రజా జీవితంతో మమేకమైన మనిషి కాదు. ఉక్రెయిన్ సినిమాల్లో కమెడియన్ పాత్రధారి మాత్రమే, క్వార్టర్ 95 నిర్మాణ సంస్థ 'వన్ ప్లస్ వన్' నెట్ వర్క్‌లో నిర్మించిన 'సర్వెంట్ ఆఫ్ ది పీపుల్' సిరీస్‌లో హిస్టరీ ప్రొఫెసర్ పాత్రలో నటించాడు. ప్రొఫెసర్ పాత్రలో అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడిన వీడియో వైరల్ కావడంతో అనుకోకుండా ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు అవుతాడు. అప్పుడున్న ఉక్రెయిన్ రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టినట్టు ఉండటంతో ఆ సినిమా సూపర్ డూపర్ హిట్టయ్యింది. అచ్చు గుద్దినట్టుగా ఈ కల్పిత పాత్రే కొంచెం అటు ఇటుగా నిజమైంది. క్వార్టర్ 95 టీవీ సంస్థ ఆ సిరీస్ పేరుతోనే సర్వెంట్ ఆఫ్ ది పీపుల్ అనే పార్టీ స్థాపించింది. జెలెన్ స్కీ ఆ పార్టీ తరపున పోటీ చేసి 72 శాతానికి పైగా ఓట్లు సాధించి ఉక్రెయిన్ అధ్యక్షుడయ్యారు. ఇది మన దగ్గర అంతకుముందే తెలుగు తమిళ భాషల్లో అర్జున్ హీరోగా నటించిన హిట్ సినిమా 'ఒక్కడు' మూవీని




కాపీ కొట్టినట్టు ఉంటుంది. జెలెన్ స్కీ ఆ ఎన్నికల్లో తూర్పు ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పుతా, అవినీతిని అంతమొందిస్తా... ఇత్యాది నినాదాలతో అధికారంలోకి వచ్చాడు. అవినీతి సంగతేమో కానీ ఆ దేశం మొత్తంలోనే శాంతి లేకుండా పోయింది. అశాంతి ఉక్రెయిన్‌కే పరిమితం కాలేదు. యూరప్ మొత్తం యుద్ధం భయంలో ఉంది. ఐరోపా ఏమిటి, ప్రపంచమే అణుయుద్ధం భయంతో ఉలిక్కిపడుతోంది. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రష్యాతో యుద్ధం విషయంలో జెలెన్ స్కీ అనాలోచిత నిర్ణయం తీసుకున్నారని అనిపిస్తోంది. దాని పర్యవసానాలు, దేశ ప్రజల స్థితిగతులు ఎలా మారిపోతాయో అంచనా వేయకుండా ఆయన కయ్యానికి కాలు దువ్వారని భావించక తప్పడం లేదు. దీనర్థం రష్యా దురాక్రమణను సమర్థించడం కాదు. పిరికితనంతో వ్యవహరించమనడం అంతకంటే కాదు. ప్రజలను పాలించడం అంటే సినిమాల్లోనో లేక స్టేజీల మీద పూనకాలు వచ్చినట్టు బూతులు తిడుతూ, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ ఊగిపోతూ చేసే ప్రసంగాలు చేయడం కానే కాదు. సమయానుకూలంగా, సందర్భోచితంగా చాకచక్యంతో వ్యవహరించడం. అవసరాన్ని బట్టి ఒకడుగు ముందుకు మరో అడుగు వెనక్కు అన్నట్టు ఉండాలి. ప్రత్యర్థి బలాబలాలను, స్వంత బలాన్ని అంచనా వేసి నిర్ణయాలు తీసుకోవాలి. అవతలివాడు బలవంతుడైతే వాడు బలహీనపడే సమయం కోసమే ఎదురు చూడాలి. మన వెంట వచ్చేవారు నమ్మకస్తులు, చివరి వరకూ తమతో ఉండేవారు ఎవరు, మధ్యలో వీడేవారు ఎవరు అని గుర్తెరగాలి. పక్కవారికి చెవులు అప్పగించరాదు. ఒకవేళ వారి మాటలు విన్నా అవి ఏ మేరకు మనకు ఉపయోగపడతాయో చూసుకోవాలి. ఇవేవీ ఆలోచించకుండానే చెప్పుడు మాటలు విని హీరోయిజం మత్తులో జెలెన్ స్కీ తీసుకున్న తప్పుడు నిర్ణయం ఇప్పుడు ఆ దేశ ప్రజల జీవితాలను సర్వనాశనం చేసింది. అమెరికా చెప్పుడు మాటలు విని నాటోలో చేరతామని రష్యా ముందు తొడలుగొట్టి మరీ జెలెన్ స్కీ యుద్ధ రంగంలోకి దిగాడు. నాటో సభ్యత్వం వచ్చి ఉంటే ఉక్రెయిన్‌కు వచ్చే లాభం ఏమిటో, ఎంతో తెలియదు కానీ ఇప్పుడు ఆ దేశం కకావికలమయ్యింది. నాటో సభ్యత్వం లేదు, బహిరంగంగా వెంట వస్తాయని భావించిన నాటో దళాలు చాటు మాటు సాయానికే పరిమితమయ్యాయి. ఉక్రెయిన్ తరపున నేరుగా యుద్ధంలో పాల్గొంటే రష్యా అధ్యక్షుడు పుతిన్ అణుదాడి చేస్తాడని నాటో దేశాలు గజగజ వణికిపోతున్నాయి. రష్యా, చైనా, ఉత్తర కొరియా, మూడూ ఒక కూటమిగా తిరగబడితే అమెరికా ఆధిపత్యం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఐరోపా దేశాలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఈ సమయంలో యుద్ధాన్ని ఆపడానికి అమెరికా చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదు.

# నాడు వారు...నేడు వీరు ..ప్రశ్నిస్తే ఎదురుదాడులు

రాజకీయ పార్టీలు అన్నీ ఒకేలా వ్యవహరిస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట? అధికారం రాగానే మరో మాట. ఇది వాటి సహజ స్వభావం. పార్లమెంట్ సమావేశాలు అందుకు ఉదాహరణ. పార్లమెంట్ ని స్తంభింపజేయడం ప్రజాస్వామ్య రూపమేనని ఒకప్పుడు వాదించిన బిజెపి నేతలు ఇప్పుడు అదే పని చేస్తున్న ప్రతిపక్షంపై మండిపడుతున్నారు. ప్రతిపక్షాల నిరసన పార్లమెంట్ 'హైజాకింగ్' అట. ఈ మాట స్వయంగా ప్రధాని అన్నారు. అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన నిరసన ఇప్పుడు పార్లమెంటును హైజాక్ చేయడం ఎలా అవుతుందో బీజేపీ నేతలే చెప్పాలి. తన సొంత రాజకీయ సందేశాలు ఇవ్వడానికి బిజెపి నాయకులు పార్లమెంటును వేదికగా ఉపయోగించు కుంటున్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై ప్రతిపక్ష బిజెపి సభ్యులు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడాన్ని 2012 సెప్టెంబరులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తప్పుపట్టారు. దీనిపై బిజెపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ పార్లమెంట్ సమావేశాలను సాగనీయకపోవడం కూడా ప్రజాస్వామ్య రూపమేనని బదులిచ్చారు. యుపిఎ–2 ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందుకే సభలో ఆందోళన చేస్తున్నా మని ఆమె తెలిపారు. ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘిం చారంటూ 20 మంది బిజెపి, తెలుగుదేశం సభ్యులను హౌస్ బులెటిన్‌లో ప్రస్తావించినందుకు బిజెపి ఎగువ సభలో నిరసన తెలిపి, ఆ తర్వాత వాకౌట్ చేసింది. దీనిని సీనియర్ నేత అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. ఆందోళన చేసిన అధికార పక్ష సభ్యులను వదిలేసి కేవలం ప్రతిపక్ష సభ్యులను మాత్రమే శిక్షించారని ఆయన మండిపడ్డారు. ఘటనలు జరిగి దశాబ్ద కాలం అయింది. ఇప్పుడు పార్లమెంట్ లో స్థానాలు మారాయి. అటు వారు ఇటు, ఇటు వారు అటు అయ్యారు. ప్రధా ని నరేంద్ర మోడీ ఆనాటి పార్టీ నేతల మాటలు మరచిపోయారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసన 'హైజాకిం గ్'కు ఓ రూపమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నకర ఎత్తుగడల ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు నిరంతరం ప్రయ



త్నిస్తున్నారు' అని విమర్శించారు. అప్పటి నుండి ఆయన మద్దతుదారులు, ఇతర బిజెపి నేతలు ఆయన మాటలను తరచూ వ్లలె వేస్తూ పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింపజేయ డానికి ఏ రూపంలో ప్రయత్నించినప్పటికీ అది దేశాభివృద్ధిని అడ్డుకోవడానికి జరిపే కుట్రగానే భావించాలంటూ వితండవాదం మొదలు పెట్టారు. ఇక కార్పొరేట్ మీడియా కూడా ప్రధాని వ్యాఖ్యలను వెనకేసుకొచ్చింది. కొన్ని అంశాలపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు అది ప్రయత్నిస్తోంది కూడా. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వివాదానికి అదానీ కేంద్ర బిందువయ్యారు. ఆయనపై మోసం, ముడుపు ల ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్‌తో పాటు అనేక ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై చట్టసభలో చర్చించాలని ఆ పార్టీలు కోరుతుంటే ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై కూడా చర్చించాల్సి ఉన్నదని ప్రతిపక్షాలు అడుగుతుంటే అందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదు. దీంతో సభ నుండి వాకౌట్ చేయడమో లేదా సభను బహిష్కరించడమో తప్ప ప్రతిపక్షాలకు వేరే మార్గం లేకుండా పోతోంది. రూల్ 267 కింద ప్రతిపక్షాలు అసాధారణ రీతిలో నోటీసులు అందించారు. లిస్టింగ్ అయిన సభా కార్యక్రమాలను ఆపేసి, అత్యవసర అంశాలపై చర్చకు పట్టుపట్టడానికి ఈ రూల్‌ను ప్రతిపక్షాలు వాడుకుంటాయి. సభా కార్యకలాపాలు నిలిచిపోవడానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని కార్పొరేట్ మీడియా నిందిస్తోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిపోతాయేమోనని అది ఆందోళన వ్యక్తం చేస్తోంది. రూల్ 267 కింద చర్చకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నిరాకరించారు. మణిపూర్ హింస, వరదల బారినపడి నష్టపోయిన వాయనాడ్‌కు ప్రత్యేక సాయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసపై కూడా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా ప్రభుత్వం విముఖత చూపుతోంది. 2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష బిజెపి డిమాండ్ మేరకు బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై చర్చించేందుకు అంగీకరించారు. నిర్భయ సామూహిక అత్యాచార ఘటనపై కూడా రోజుల తరబడి చర్చ సాగింది. ఈ చర్చల కారణంగానే లైంగిక దాడి విషయంలో కొత్త చట్టం వచ్చింది. అయితే ఇప్పుడు కాషాయ పార్టీ మాత్రం పార్లమెంటును తన రాజకీయ సందేశాల కోసం వాడుకుంటోంది. సభలో చర్చల సమయంలో హిందీని ప్రధాన భాషగా రుద్దేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. ఇరువురు సభాపతులు తటస్థ పరిశీలకుల మాదిరిగా కాకుండా బిజెపి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్ష నేతల మైక్రోఫోన్లను కట్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా సభా కార్యకలాపాలు ఏకపక్షంగానే సాగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే వారిని సభ నుండి బహిష్కరిస్తున్న ఉదంతాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

# స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న యువత.. అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్న ఆశావహులు.!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**కామారెడ్డి :ప్రజా స్వేచ్ఛ**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం సిద్ధమవుతుంది. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించింది.సమగ్ర సర్వే నివేదిక రాగానే దాని ఆధారంగా ఓటర్ల జాబితాను కూడా రూపొందించి రిజర్వేషన్ల ప్రకటనకు సిద్ధం కావాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు వచ్చాయని తెలుస్తోంది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో జాబితా తయారీకి శిక్షణ అందించేందుకు జిల్లాల నుంచి డాటా ఎంట్రీ ఆపరేటర్లను (మాస్టర్ ట్రైనర్లు)గా ఎంపిక చేసి హైదరాబాద్ కు పంపించాలని ఎస్ఈసీ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో బీసీ గణన పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహిస్తారన్న కోణంలో ఆలోచించి మరో రెండు నెలల పాటు ఎలక్షన్స్ ఉండవనే అభిప్రాయంతో ఉన్న ఆశావహుల్లో కదలిక తీసుకువచ్చింది. దీంతో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల సందడి షురూ అయ్యింది. పోటీకి సై అంటున్న ఆశావహుల్లో సర్కారు నిర్ణయం ఆనందం కలిగిస్తుండగా.. పోటీ చేయాలనుకునే నేతలు తమ మద్దతుదారులతో సమాలోచనలు ప్రారంభించారు.

**ఆసక్తి కనబరుస్తున్న యువత..**

సర్పంచుల పదవీకాలం పూర్తయి సంవత్సరం కావస్తుండగా ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవి కాలం కూడా నాలుగు నెలల క్రితం ముగిసిన విషయం తెలిసిందే. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంతో ఆశావహులు ప్రజలను ఇప్పటి నుంచే మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. గతంలో ఉన్న రిజర్వేషన్ మారితే ఎవరు పోటీ చేయాలని ? మారక పోతే ఎవరు బరిలో ఉంటారు ? అనే విషయాల పై గ్రామాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఈ సారి ఎన్నికల్లో పోటీ చాలా రసవత్తరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన తాజా, మాజీలు, కొత్త వ్యక్తులు సర్పంచ్, ఎంపీటీసీల కొరకు పోటీ చేసేందుకు నిమగ్నమై ఉన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ..**

చేసేందుకు యువకులు అధిక సంఖ్యలో ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కొక్క పార్టీ నుండి ముగ్గురు లేదా నలుగురు పోటీ చేసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఎన్నికల్లో అయ్యే ఖర్చును సైతం ఇప్పటికే సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో అధికార పార్టీకి చెందిన ఆశావహులు ఎంత ఖర్చుకైనా వెనకడుగు వేసేది లేదని చెబుతున్నారు. గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆరు గ్యారంటీల పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మరోపక్క బీఆర్ఎస్ సైతం ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించుకుని పంచాయతీల్లో గెలవాలని ప్రయత్నిస్తోంది.

**పెరగనున్న బీసీ రిజర్వేషన్లు...**

స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచడం కోసం సమగ్ర సర్వే చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రిజర్వేషన్లు పరిశీలిస్తే పదిహేను శాతం ఎస్సీలకు, ఆరు శాతం ఎస్టీలకు, 24 శాతం బీసీలకు అమలవుతున్నాయి. ఇక కులాల వారీగా తమకు అధికంగా ఓట్లు ఉన్నందున తమకే అవకాశం ఇవ్వాలని కొందరు, పార్టీలో ఏళ్లుగా ఎంతో కష్టపడి పనిచేసి ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేశామని మరి కొందరు ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేల వద్ద ఆశావహులు చెబుతూ బరిలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం.

**సమగ్ర సర్వే ఆధారంగా ఓటర్ల జాబితా..**

రాష్ట్రంలో ఇటీవల సమగ్ర సర్వే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఓటరు జాబితాను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేసినట్లుగా తెలుస్తోంది. ఇదే జరిగితే ఇప్పుడున్న రిజర్వేషన్లు మారే అవకాశాలు ఉన్నాయి. ఈ నెలాఖరులోగా గ్రామ, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియ సైతం ఆ లోపు చేపట్టాలని సూచించారు. ఓటర్ల జాబితా ఆధారంగా గ్రామాల్లో ఓటరు జాబితాలను ప్రకటించి వార్డుల వారీగా సిద్ధం చేయనున్నారు. పంచాయతీ ఓటర్లు 650 లోపు ఉన్నట్లయితే ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు. 200 మందికి రెండు, 400 మందికి మూడు, 400 – 650 మందికి నాలుగు, 650 కి మించితే మరో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లుగా తెలుస్తోంది. కాగా గతంతో పోల్చితే వార్డు స్థానాల సంఖ్య సైతం పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

**–తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు**

# రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది.

**ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్**

హైదరాబాద్‌లో దేశంలోని మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ (GSEC)ని నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో స్థాపించే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే అయిదవది. ఏషియా పసిఫిక్ జోన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ ఇదే.

GSEC ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత మరియు ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా పనిచేస్తుంది.దేశంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేస్తుంది.ఇప్పటికీ భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్‌లో నిర్మిస్తోంది.ఈ ఏడాది అక్టోబర్ 3న జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు విషయాన్ని ఆ కంపెనీ ప్రకటించింది. అప్పటి నుంచి జీఎస్ఈసీని తమ రాష్ట్రంలోనే నెలకొల్పాలని, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో ఈ అత్యాధునిక సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది.హైదరాబాద్‌లో ఈ సేఫ్టీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య ఒప్పందం చేసుకోవటంతో మరోసారి హైదరాబాద్ ప్రపంచంలో మేటీ ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తుందని అన్నారు.గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ గారి అధ్వర్యంలోని కంపెనీ ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన 5 టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఅ పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు.ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**–తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు**

# యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అల్లం గణేష్ ఎన్నిక

**ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన అల్లం గణేష్**



**కేసముద్రం, డిసెంబర్ 6, ప్రజా స్వేచ్ఛ**

యువజన కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అల్లం గణేష్ ఎన్నిక అయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఎంతో నమ్మకంతో యూత్ కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినటువంటి మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్,డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి,పొరిక సాయి శంకర్,కంకర అయ్యప్ప రెడ్డి,కేసముద్రం మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు మరియు యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఈగ మల్లేశం



**వరంగల్ ప్రతినిధి ,06డిసెంబర్,ప్రజా స్వేచ్ఛ**

నూతన వధూవరులను కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆశీర్వదించారు.శుక్రవారం జఫర్ ఘడ్ మండల మాజీ ఎంపీపీ కట్ట మనోజ్ రెడ్డి కుమార్తె రాధ-అవినాష్ ల వివాహం హనుమకొండ లోని వడ్డేపల్లి పీజీఆర్ గార్డెన్స్ లో జరిగింది.ఈ వేడుకకు కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి దీవించారు.అనంతరం వివాహ వేడుకకు హాజరైన పలువురు నేతలు మల్లేశంను మర్యాద పూర్వకంగా కలిశారు.

# ఎంఎస్ఆర్ గార్డెన్ లో ఎల్లారెడ్డి-శైలజ వివాహ వేడుకల్లో పాల్గొన్న యెల్లంలా సంజీవరెడ్డి



**ఆలేరు ఆర్సీ,డిసెంబరు 06ప్రజా స్వేచ్ఛ**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్లో మోటకొండూరు మండలంలోని అమ్మనబోల్ మధిర అభిద్ నగర్ గ్రామానికి చెందిన లోట్ల బాపురెడ్డి కుమారుడు ఎల్లారెడ్డి మరియు తుమ్మలగూడెం గ్రామానికి చెందిన సింగనబోయిన జంగయ్య కుమార్తె శైలజ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధువారులను ఆశీర్వదించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలేరు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెసు పార్టీ నాయకులు యెల్లంలా సంజీవరెడ్డి. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనిని కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దిలీప్ రాజ్



**హన్మకొండ ప్రతినిధి ,06డిసెంబర్ప్రజా స్వేచ్ఛ**

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవిందర్ రావును వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ కలిశారు.నూతనంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్బంగా కేఆర్ దిలీప్ శుక్రవారం హన్మకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెనీ రవిందర్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్బంగా దిలీప్ రాజ్ ను చైర్మన్ రవిందర్ రావు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి,బొమ్మినేని రాకేష్ రెడ్డి,వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఆవుల పవన్ కల్యాణ్,ఐనవోలు,వర్ధన్నపేట మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి సుధీర్,పత్రి బాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలో రాణిస్తున్న కేజీబీవీ విద్యార్థిని



**కేసముద్రం, డిసెంబర్ 6, ప్రజా స్వేచ్ఛ**

జాతీయస్థాయి కరాటే పోటీలో రాణిస్తున్న కేజీబీవీ విద్యార్థిని ని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందించారు. ఇటీవల హనుమకొండలో బిఎంఆర్ కరాటే అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి కరాటే &కుంగ్ - ఫు,స్పా రింగ్ ఆల్ కలర్ బెల్ట్ స్పారింగ్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించిన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేజీబీవీ లో చదువుతున్న విద్యార్థిని చెన్నభోయిన అక్షితను మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు డీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డి, జి సి డి ఓ విజయ కుమారి లు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కుంగ్- ఫు & కరాటే & ఉషు కోచ్ గడ్డల రాజు మరియు కేజీబీవీ ఇంచార్జ్ హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

## వాగు మీద బ్రిడ్జి నిర్మించాలని కొండా సురేఖ గారికి వినతి పత్రం



**ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్**

మంత్రి కొండా సురేఖ గారికి వినతి పత్రం అందజేసిన చిటకోడూర్ బ్రిడ్జి సాధన సమితి కన్వీనర్ యాసారపు కరుణాకర్ ఈరోజు జనగామలో రాష్ట్ర పర్యావరణ అటవీ మరియు దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారికి వినతిపత్రం అందజేసిన చిటకోడూర్ బ్రిడ్జి సాధన సమితి ప్రతినిధులు. ఈ సందర్భంగా మంత్రి గారితో చిటపటూరు వాగు మీద ఉన్న కల్వర్టు ఒకపక్క కూలిపోయిందని, 10 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం చేసే వాగు మీద బ్రిడ్జి నిర్మించాలని సాధన సమితి కన్వీనర్ యాసారపు కరుణాకర్ కోరగా మంత్రిగారు సనుకూలంగా స్పందించి బ్రిడ్జి నిర్మాణం కోసం ముఖ్యమంత్రి గారికి మరియు సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు అయ్యేలాగా చూస్తాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనగామ మార్కెట్ చైర్మన్ బనుగా శివరాజ్ యాదవ్, మరిగడి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కర్రె పరశు రాములు, చెరుకూరి సిద్ధిరాములు, చామకూర చిరంజీవి, చిలువేరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 68వ వర్ధంతి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, పొలగాని వెంకటేష్ గౌడ్ ఘన నివాళులు..




**మిర్యాలగూడ ఆర్సీ,డిసెంబర్ 6 ప్రజా స్వేచ్ఛ**

భారత రాజ్యాంగ సృష్టికర్త, సమానత్వ స్ఫూర్తిని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడలో ఘన నివాళు లర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపియన్ చైర్మన్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పొలగాని వెంకటేష్ గౌడ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ, ఆయన అందించిన విశేష సేవలను పొలగాని వెంకటేష్ గౌడ్ గుర్తు చేశారు. డాక్టర్ అంబేద్కర్ న్యాయ సమానత్వం, సమాజంలో దళితుల హక్కుల కోసం చేసిన పోరాటం దేశానికి మాత్రమే కాక, ప్రపంచానికి ఆదర్శప్రాయమైనది. రాజ్యాంగ రూపకల్పనలో ఆయన మేధస్సు, శ్రమ ప్రతి భారత పౌరుని హక్కులను రక్షించే అత్యుత్తమ దృశ్యంగా నిలిచింది అని ఆయన అన్నారు. అంబేద్కర్ మహిళల సాధికారత, సామాజిక సమానత్వం కోసం అమూల్యమైన సిద్ధాంతాలు ప్రవేశపెట్టారని, ఆయన కలల భారత్ కోసం యువతను ఆదర్శంగా నిలవాలని వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి మహా







**ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్**

ఈరోజు బి.యన్.రెడ్డి లో ఎస్వీ లీడ్స్ రియల్ ఎస్టేట్ ఆఫీస్ లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహా ఘనంగా జరిగినది భగవంతుడైన అయ్యప్ప స్వామి ఆశీర్వాదంతో ఆఫీసు లీడర్స్ అసోసియేట్స్ కస్టమర్స్ భక్తులుగా ఈ పవిత్ర పూజలో పాల్గొనడం జరిగినది స్వామి మహిమలను వీరందరూ స్మరించి మనందరం కలిసికట్టుగా ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని అయ్యప్ప స్వామి అయ్యప్ప కుటుంబ సభ్యులు మన కుటుంబానికి మరియు మన సమాజానికి సనాతన ధర్మానికి అయ్యప్పస్వామి ఆశీర్వాదాలు లభిస్తాయని వీరందరూ కలిసి భక్తితో భజనలతో భక్తి గానాలతో స్వామి వారి సేవలు ఏకతా భావంతో ఈ పూజా కార్యక్రమాన్ని ఆధ్యాత్మికంగా విజయవంతం చేశారు పండ్లు పంచామృతం మహా పడి ప్రసాదం తీర్థప్రసాదాలు అన్నప్రసాదాలు స్వాములకు భక్తులకు కాలనీవాసులకు ఎస్ వి లీడ్స్ సమస్త యాజమాన్యం వారు అందజేశారు ఈ పూజ కార్యక్రమాన్ని తిలకించి భక్తులు తీర్థప్రసాదాలు గైకొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు ఇందులో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ మెజిస్ట్రేట్ తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి గారు మరియు తరిగొప్పుల అమరేందర్ ప్రజాపతి టిపిసిసి లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ ఆర్ టి ఐ డిపార్ట్మెంట్ స్టేట్ కన్వీనర్ గారు రవిరాజు బ్రదర్స్ హనుమా సార్ రమేష్ సార్ మంగళ సార్ జితేందర్ సార్ ఉమారాణి వినోద్ కుమార్ కొండర్ విజయలక్ష్మి రవి రాజు బ్రదర్స్ శ్యామ్ సుందర్ బాలకృష్ణ మరియు ఆఫీస్ స్టాఫ్ లీడర్స్ అసోసియేట్స్ ఇందులో పాల్గొన్నారు ఈ పూజ కార్యక్రమాన్ని అతి ఘనంగా జరిపించినారు

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు**

# ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**చేర్యాల ప్రజా స్వేచ్ఛ**

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో.. మాల మహానాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో, రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతిని పురస్కరించుకుని గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనైనది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ శ్రీ. పెడతల ఎల్లారెడ్డి గారు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరంతరం పేద ప్రజల అభ్యున్నతి గురించి అలుపెరుగని పోరాటాలు చేసి, సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలని, రాజ్యాంగం కల్పించిన ఫలాలు అందరికీ అందాలని భావించి స్త్రీ పురుషులు ఇద్దరికీ సమాన హక్కులు ఉండాలని కోరిన గొప్ప మహనీయుడు అని కొనియాడారు. భవిష్యత్తులో అంబేద్కర్ గారు ఇంకా సమ సమాజం నిర్మాణం కోసం ఏదైతే ఆశించారో ఆయన ఆశయ సాధన కోసం మనమందరం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని సాధించేందుకై ప్రతి ఒక్కరం కృషి చేయాలని కోరారు. అలాగే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకై కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలను చైతన్యవంతం చేసి భావితరాలకు రాజ్యాంగ పలాలను అందించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు గ్రామ అధ్యక్షులు అల్లిబిల్లి రాములు, ప్రధాన కార్యదర్శి మేడిపల్లి చందు, డివిజన్ అధ్యక్షులు చింతల విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శి మేడిపల్లి నరసింహ, గౌరవ సలహాదారులు మొగ్గం బాలయ్య, అల్లిబిల్లి మల్లేశం, మేడిపల్లి రాజయ్య, మాల మహానాడు గ్రామ కమిటీ నాయకులు మేడిపల్లి ఆంజనేయులు,మేడిపల్లి రాజ్ కుమార్,మేడిపల్లి శ్రీనివాస్ మేడిపల్లి మహేష్. నీరటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# వాటి జోలికి వెళ్లొద్దు: సెబీ

అనామక ఆన్‌లైన్ వేదికల ద్వారా లభించే అన్‌లిస్టెడ్ డెట్ సెక్యూరిటీస్‌తో జాగ్రత్తగా ఉండాలని, వాటికి జోలికి వెళ్లరాదని గురువారం ఇన్వెస్టర్లను మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ హెచ్చరించింది. ఈ అన్‌రిజిస్టర్డ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ఎటువంటి నియంత్రణా ఉండదని, మదుపరుల రక్షణ వ్యవస్థ కూడా లేదని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. కంపెనీల చట్టం 2013ను ఉల్లంఘిస్తూ 200లకుపైగా ఇన్వెస్టర్లకు అన్‌లిస్టెడ్ సెక్యూరిటీస్‌ను అక్రమ సంస్థలు ఆఫర్ చేస్తున్నాయని సెబీ గుర్తించింది. ఈ క్రమంలోనే పైవిధంగా మదుపరులను అప్రమత్తం చేసింది. వీటిలో పెట్టుబడులు పెడితే చాలా ప్రమాదమని గుర్తుచేసింది. కాగా, లిస్టెడ్ డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఆథరైజ్డ్ స్టాక్‌బ్రోకర్లు నిర్వహించే రిజిస్టర్డ్ ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌ల్లోకి మాత్రమే వెళ్లాలని ఈ సందర్భంగా సెబీ సూచించింది. ఇదిలావుంటే గత 30 రోజుల్లో ఎలాంటి లావాదేవీలు జరుపని క్లయింట్స్ ఖాతాల్లోని ఫండ్స్ సెటిల్మెంట్‌కు సెబీ నడుం బిగించింది. 3 పనిదినాల్లో సమస్యను పరిష్కరించేలా స్టాక్ బ్రోకర్లకు సెబీ సూచిస్తున్నది. అలాగే ఈక్విటీ మార్కెట్లలో క్లోజ్ యాక్షన్ సెషన్ను సెబీ పరిచయం చేయాలని చూస్తున్నది. దేశంలోని ఈక్విటీ క్యాష్ మార్కెట్‌లో స్టాక్స్ క్లోజింగ్ ధర నిర్ధారణకే దీన్ని ప్రతిపాదిస్తున్నది. ఇక ఎక్స్చేంజీల రిపాజిటరీ ప్లాట్‌ఫామ్‌పై ఐపీవో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిందిగా మర్చంట్ బ్యాంకర్లను సెబీ ఆదేశించింది. మరోవైపు ఫిజికల్ సెటిల్మెంట్ తప్పనిసరిగా ఉన్న డెరివేటివ్స్ మార్కెట్‌లో సెటిల్మెంట్ రిస్క్‌లను పరిష్కరించేందుకు ఫ్యూచర్స్‌లోకి ఐటీఎం ఆప్షన్స్ డివాల్వింగ్‌పై ఓ కన్సల్టేషన్ పేపర్‌ను సెబీ ఇచ్చింది.

## హ్యుందాయ్ కార్లు ప్రియం




ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్ ఇండియా కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల వాహన ధరలను రూ.25 వేల వరకు పెంచుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ హెచ్చుతగ్గుదలకు లోనుకావడం, లాజిస్టిక్స్ ఖర్చులు అధికం కావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ డైరెక్టర్, సీవోవో తరుణ్ గార్గ్ వెల్లడించారు. కొత్త మాడల్‌తోపాటు పాత మాడళ్లకు కూడా ఈ ధరల పెంపు వర్తించనున్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.5.92 లక్షల విలువైన గ్రాండ్‌ఐ10 నియోస్ నుంచి రూ.46.05 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనం అయోనిక్ 5 మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

## లక్ష డాలర్లకు బిట్‌కాయిన్




అదృశ్య కరెన్సీ బిట్‌కాయిన్ జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న ఈ బిట్‌కాయిన్ తాజాగా లక్ష డాలర్లకు చేరుకున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంఫ్ గెలిచినప్పటి నుంచి ఈ కరెన్సీ భారీగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గురువారం బిట్‌కాయిన్ విలువ 103,400 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాది ఈ అదృశ్య కరెన్సీని కొనుగోలు చేసిన వారు కోటీశ్వరులైనారని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

## జనవరి నుంచి మారుతి సుజుకి కార్ల ధరలు పెంపు..




ఆడి ఇండియా, హ్యుండాయ్ మోటార్ ఇండియా బాటలోనే మారుతి సుజుకి ప్రయాణిస్తున్నది. జనవరి ఒకటో తేదీ నుంచి కార్ల ధరలు నాలుగు శాతం పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. మోడల్స్ వారీగా ధరల్లో మార్పులు ఉంటాయని వివరించింది. కార్ల తయారీ ఖర్చులు పెరిగిపోవడంతో కొంత భారం కస్టమర్లపై మోపక తప్పడం లేదని మారుతి సుజుకి తెలిపిందిజనవరి నుంచి కార్ల ధరలు పెరుగుతాయని ఈ నెల ప్రారంభంలోనే ఆడి ఇండియా ప్రకటించింది. అన్ని రకాల మోడల్ కార్లపై మూడు శాతం ధరలు పెంచుతున్నట్లు తెలిపింది. ఆడీ ఏ4, ఆడి క్యూ7, ఆడి ఈ-ట్రాన్ జీటీ, ఆడీ ఆర్ఎస్ క్యూ8 మోడల్ కార్లు అత్యంత పాపులర్. అన్ని మోడల్ కార్లపై గరిష్టంగా రూ.25 వేల వరకూ అన్ని కార్ల ధరలు పెంచుతామని గురువారం హ్యుండాయ్ మోటార్స్ ప్రకటించింది.

## మరోసారి తన బలహీతను బయటపెట్టిన కోహ్లీ



ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న పింక్ బాల్ టెస్ట్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(7) తీవ్రంగా నిరాశపరిచాడు. మరోసారి తన బలహీతను బయటపెట్టిన కోహ్లీ.. స్లిప్‌లో స్టీవ్ స్మిత్‌కు సునాయస క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీని వెంటాడి మూల్యం చెల్లించుకున్నాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కోహ్లీ..పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. విరాట్ కోహ్లీ ఔటవ్వడంపై టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్స్ ఆడటంలో కోహ్లీ ఇబ్బంది పడుతున్నాడని, ఈ బలహీనతను అధిగమించేందుకు కూడా ప్రయత్నించడం లేదని పేర్కొన్నాడు. ఈ బలహీనత కారణంగానే టెస్ట్‌ల్లో కోహ్లీ యావరేజ్ తగ్గిందని అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ దిగజారడానికి ప్రధాన కారణం ఒకటి ఉంది. అంతకుముందు 50 ప్లస్ ఉండే అతని యావరేజ్ 48కి పడిపోయింది. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీలను ఆడే బలహీనత కోహ్లీని వెంటాడుతోంది. మరీ ముఖ్యంగా.. ఆ బలహీనత నుంచి బయటపడేందుకు కూడా కోహ్లీ ప్రయత్నించకపోవడం అతని మొండితనంలా అనిపిస్తోంది.'అని మంజ్రేకర్ ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ గణంకాలకు సంబంధించిన పోస్టులు కూడా నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఏడాది కోహ్లీ ఒక సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ మాత్రమే చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు ఆలౌటైంది. యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుకోవడంతో భారత్ గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. కేఎల్ రాహుల్(64 బంతుల్లో 6 ఫోర్లతో 37), శుభ్‌మన్ గిల్(51 బంతుల్లో 5 ఫోర్లతో 31) పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/48) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. కోహ్లీతో పాటు యశస్వి జైస్వాల్(0), రోహిత్ శర్మ(3) దారుణంగా విఫలమయ్యారు.

## చరిత్ర సృష్టించిన మిచెల్ స్టార్క్




అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న డే/నైట్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 44.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (42బీ 54 బంతుల్లో, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. కేఎల్ రాహుల్ (37బీ 64 బంతుల్లో, 6 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (31బీ 51 బంతుల్లో, 5 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (22బీ 22 బంతుల్లో, 3 ఫోర్లు), రిషభ్ పంత్ (21బీ 35 బంతుల్లో, 2 ఫోర్లు) రాణించారు. మిగిలిన బ్యాటర్లూ ఎవరూ రెండంకెల స్కోరు అందుకోలేకపోయారు. యశస్వీ జైస్వాల్, హర్షిత్ రాణా, జస్‌ప్రీత్ బుమ్రా డకౌటయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ (6/48) ఆరు వికెట్లతో విజృంభించాడు. ప్యాట్ కమిన్స్ (2/41), స్కాట్ బొలాండ్ (2/54) చెరో రెండు వికెట్లు తీశారు. అయితే ప్రధాన బ్యాటర్లు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టిన స్టార్క్ అరుదైన ఘనత సాధించాడు. పింక్ బాల్ టెస్టుల్లో అయిదు వికెట్ల ఘనతను నాలుగు సార్లు సాధించిన ఏకైక బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. డే/నైట్ టెస్టుల్లో ఓ ఇన్నింగ్స్‌లో ఏ బౌలర్ రెండు కంటే ఎక్కువ సార్లు అయిదు వికెట్లను సాధించలేకపోయాడు. కానీ స్టార్క్ ఏకంగా నాలుగు సార్లు ఈ ఘనత సాధించాడు. కాగా, భారత్‌పై ఓ ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు పడగొట్టడం స్టార్క్‌కు ఇదే తొలిసారి. కాగా, స్టార్క్ ఓవరాల్‌గా తన టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. 14.1 ఓవర్లు బౌలింగ్ చేసిన స్టార్క్ 48 పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు 2016లో శ్రీలంకపై 50 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టిన రికార్డు తన అత్యుత్తమంగా ఉండేది.

# స్పోర్ట్స్

## ఆసియా కప్ 2024 టోర్నీలో ఫైనల్ చేరిన భారత యువ జట్టు



అండర్ 19 ఆసియా కప్ 2024 టోర్నీ భారత యువ జట్టు ఫైనల్ చేరింది. శ్రీలంక అండర్ 19 జట్టుతో శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత అండర్ 19 జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియా యువ సెన్సేషన్, 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ(36 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 67) మరోసారి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46.2 ఓవర్లలో 173 పరుగులకు కుప్పకూలింది. శ్రీలంక బ్యాటర్లలోలాక్విన్ అబే సింఘే(110 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీతో రాణించగా.. శారుజన్ షణ్ముగనాథన్(78 బంతుల్లో 2 ఫోర్లతో 42) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో చేతన్ శర్మ(3/34) మూడు వికెట్లు తీయగా.. కిరణ్, ఆయుష్ మాత్రే రెండేసి వికెట్లు పడగొట్టారు. యుధజిత్ గుహ, హార్దిక్ రాజ్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం భారత అండర్ 19 జట్టు 21.4 ఓవర్లలోనే 3 వికెట్లకు 175 పరుగులు చేసి 170 బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు ఆయుష్ మాత్రే(28 బంతుల్లో 7 ఫోర్లతో 34) రాణించాడు. కెప్టెన్ మహమ్మద్ అమాన్(26 బంతుల్లో 2 ఫోర్లతో 25 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. శ్రీలంక బౌలర్లలో విహాస్, విరన్, ప్రవీణ్ తలో వికెట్ తీసారు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి 5 సిక్సర్లతో అలరించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 1.10 కోట్లు పలికి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ.. ఈ టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఒక్క పరుగే చేసిన ఈ చోటా సూరీడు.. జపాన్‌తో 23 పరుగులకే వెనుదిరిగాడు. యూఏఈతో జరిగిన మూడో మ్యాచ్‌లో మాత్రం తన అసలు సిసలు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 46 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 పరుగులతో అజేయంగా నిలిచాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో అదే జోరు కనబర్చాడు. రాజస్థాన్ రాయల్స్ ఈ చోటా సూరీడుని కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. 13 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేలంలో అమ్ముడైన ఆటగాడిగా ఈ బీహార్ కుర్రాడు రికార్డ్ సాధించాడు. అంతేకాకుండా అండర్ 19 క్రికెట్ చరిత్రలోనే అతి పిన్నవయస్కుడిగా కూడా నిలిచాడు. డిసెంబర్ 10న దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్ జట్టుతో భారత్ తలపడనుంది. పాకిస్థాన్‌తో జరిగిన తొలి సెమీఫైనల్లో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.







# పుష్పరాజ్ డామినేషన్ కంటిన్యూ..

## షారుక్ ఖాన్ జవాన్ రికార్డ్ బద్దలు..!

అల్లు అర్జున్  సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన మోస్ట్ ఎవెయిటెడ్ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్  ఈ పాన్ ఇండియా సినిమా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై రికార్డుల వేట మొదలుపెట్టింది. పుష్ప 2 ది రూల్ రిలీజైన అన్ని సెంటర్లలో దాదాపు హౌస్‌ఫుల్ షోలతో విజయవంతంగా స్క్రీనింగ్ అవుతోంది. ఇప్పటికే ఓపెనింగ్ డేన నైజాం ఏరియాలో ఈ చిత్రం రూ. 30 కోట్లు షేర్ రాబట్టి.. ఆర్‌ఆర్‌ఆర్ (రూ. 23.38 కోట్లు)పై ఉన్న రికార్డును అధిగమించినట్టు వార్తలు వచ్చాయి. తాజాగా మరో అరుదైన ఫీట్‌ను ఖాతాలో వేసుకుందని బీటౌన్ సర్కిల్ కథనం. జవాన్ ఫస్ట్ డే రూ. 65 కోట్లు వసూళ్లు రాబట్టగా.. పుష్ప 2 రూ. 67 కోట్లతో రికార్డ్‌ను బీట్ చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ లెక్కన పుష్ప 2 బాక్సాఫీస్ రికార్డుల మోత ఖాయమని పుష్పరాజ్ చెప్పకనే చెబుతున్నాడు మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

# పెళ్లి పనులు షురూ..

## ఫోటోస్ షేర్ చేసిన హీరోయిన్ కీర్తి సురేష్..

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్.. ఇప్పుడు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టబోతుంది. తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తటిల్ ను కీర్తి పెళ్లి చేసుకోబోతున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటన వచ్చింది. వీరిద్దరి దాదాపు 15 ఏళ్లుగా స్నేహితులు. ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారి.. ఇరు కుటుంబాల అంగీకారంతో ఇప్పుడు పెళ్లి పీటలు ఎక్కనున్నారు. వీరిద్దరు ఈనెల 12న గోవాలో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోనున్నారు. ఇప్పటికే పెళ్లి తేదీ దగ్గరపడడంతో ఇందుకు సంబంధించిన పనులను స్టార్ట్ చేసినట్లు కీర్తి సురేష్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. తాజాగా కీర్తి తన సోషల్ మీడియా ఖాతాలో  వెడ్డింగ్ మొదలవుతుంది.. ‘ అంటూ గోవా ఫ్లైట్ టికెట్స్ ఫోటోలను షేర్ చేసింది. డిసెంబర్ 12న కీర్తి సురేష్, ఆంటోనీ పెళ్లి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. అయితే అదే రోజున సూపర్ స్టార్ రజినీకాంత్ పుట్టినరోజు కావడం విశేషం. వీరి పెళ్లికి ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితులు, బంధువులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం కీర్తి మెడలో ఆంటోనీ తాళీ కట్టనున్నారు. అదే రోజు సాయంత్రం గోవాలోని ప్రముఖ చర్జిలో కీర్తి, ఆంటోనీ రింగ్స్ మార్చుకోనున్నారు. కీర్తి సురేష్  సౌత్ ఇండస్ట్రీలో నటిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన కీర్తి.. ఆ తర్వాత మహానటి సినిమాకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళంలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అగ్రకథానాయికగా గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటేందుకు రెడీ అయ్యింది కీర్తి. త్వరలోనే కీర్తి బ్యాచిలర్ లైఫ్ కు గుడ్ బై చెప్పేస్తుంది





# సూర్యకు జోడీగా త్రిష ఫిక్స్..

## – షూటింగ్‌లో జాయిన్ అయిన అందాల భామ

స్టార్ హీరో సూర్య రీసెంట్ గా కంగువ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సిరుత్తై శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ,యువి క్రియేషన్ సంయుక్తంగా నిర్మించాయి. రూ. 350 కోట్లకు పైగా బడ్జెట్‌తో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. ఈ సినిమా తర్వాత తదుపరి సినిమాల్లో జోరుమీదున్నాడు హీరో సూర్య. ఇప్పటికే  సూర్య రెండు సినిమాల్లో నటించేందుకు సూర్య రెడీ అయ్యారు. కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న సూర్య44 సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని ఫైనల్ వర్క్ జరుపుకుంటోంది. ఈ మూవీతో పాటు ఇప్పుడు ఆర్. జె. బాలాజీ దర్శకత్వంలో సూర్య 45 చిత్రంలో నటిస్తున్నాడు. విభిన్నమైన కథాంశంతో దర్శకుడు ఆర్జే బాలాజీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ టాలెంట్ డైరెక్టర్ కు ఇది 3వ చిత్రం. ఇందులో హీరోయిన్ గా ఎవరు నటించబోతున్నారు అనే ప్రశ్నలు అభిమానుల్లో నెలకొని ఉండగా, నటి త్రిష నటిస్తోందనే వార్తలు వచ్చాయి. దాన్ని కన్ఫర్మ్ చేసేలా ఫొటోలు విడుదలై సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి గత నెలాఖరున పొల్లాచ్చిలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరగ్గా, మరుసటి రోజు షూటింగ్ మొదలైంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై వారం రోజులు గడిచిన తర్వాత సూర్య45 నటి త్రిష జాయిన్ అయిందని తెలుస్తోంది. ఈ సందర్భంలో కోయంబత్తూర్‌లో వేసిన భారీ టెంపుల్ సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. గతంలో మౌనం పసితే, ఆరు చిత్రాల్లో సూర్య, త్రిష జంటగా నటించారు.



# శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్న నాగచైతన్య, శోభిత దంపతలు

అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల  వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరి వివాహ అంగరంగ వైభవంగా జరిగింది. తాజాగా నూతన జంట శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని  సందర్శించారు. అక్కినేని నాగార్జునతో కలిసి చైతూ–శోభిత జంట శుక్రవారం శ్రీశైలం వెళ్లారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు.




# ఓటీటీలోకి కంగావా

## ఓలుక్కేయండి మరీ..!

సూర్య హీరోగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘కంగువా’ ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. డిసెంబరు 8న ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ప్రైమ్ వీడియో ఎక్స్ వేదికగా పోస్టర్‌ను పంచుకుంది. తెలుగుతోపాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో ఇది అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది. విశాపటానీ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో బాబీదేవోల్ విలన్‌గా కనిపించారు. ఫ్రాన్సిస్ (సూర్య) గోవాలో ఓ బౌంటీ హంటర్. పోలీసులు కూడా చేయలేని పనుల్ని చేసి, అందుకుగానూ వాళ్ల నుంచి డబ్బు తీసుకుంటూ కాలం గడుపుతుంటాడు. ఏంజెలా (దిశా పటానీ)దీ ఇదే పని. ఒకప్పుడు వీరిద్దరూ ప్రేమికులే. ఆ తర్వాత విడిపోయి ఎవరి దారులు వాళ్లు చూసుకుంటారు. ఫ్రాన్సిస్, తన స్నేహితుడు (యోగిబాబు)తో కలిసి ఓ బౌంటీ హంటింగ్ పనిపై ఉన్నప్పుడే జీటా అనే బాలుడిని కలుసుకుంటారు. ఫ్రాన్సిస్, జీటా కలుసుకోగానే ఇద్దరికీ ఏదో తెలియని సంబంధం ఉన్న భావన కలుగుతుంది. ఆ తర్వాత ఆ బాలుడి ప్రాణానికి ప్రమాదం ఉందని అర్థమవుతుంది. మరి జీటాని కాపాడటానికి ఫ్రాన్సిస్ ఎలాంటి సాహసాలు చేశాడు. ఈ జీటాని వెంటాడుతున్నది ఎవరు? ఫ్రాన్సిస్, జీటా, 1070 సంవత్సరాల నాటి ప్రణవకోన యువరాజు కంగువా (సూర్య)కి మధ్య సంబంధం ఏమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమాపై ఓ లుక్కేయాల్సిందే!

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492